'ఆంధ్రభూమి' దినపత్రిక - 1.7.1986

# మూగ ప్రశ్న

"మరోసారి ప్రజాస్వామ్యం మంటగలిసిపోయింది. ఎలక్షన్లు జరుగుతాయనుకోడం శుద్ధ భ్రమ! ఆ దేశ ప్రజలకు విమోచన లేదు" - సూర్యం గొంతులో ఆవేశం, కాస్త ఆగ్రహం!

అంతంతేసి మాటలు మారయ్యకి అర్థం కావు. ప్రజలకి ఎలక్షన్లు నిజంగా లాభం కలిగిస్తాయా? కలిగిస్తే ఎవరికి? ఆ సందేహం మారయ్యది.

మారయ్య సూర్యం పక్కన ఒక మెట్టు దిగువున కూర్చున్నాడు.

మారయ్య సూర్యంలా మాస్టారు కాదు. సూర్యం మాస్టారు శిష్యుడు కాదు. కొడుకూ కాదు. మిత్రుడూ కాదు, అతని దగ్గర పనివాడు!

మారయ్య స్వాతంత్ర్యం రాకముందు పుట్టి ఆ వూళ్ళో అలాగే వుండిపోయిన వాడు. అనగా కూలిపని వారసత్వంగా కొనసాగిస్తున్నవాడు.

సూర్యం స్వాతంత్ర్యం వచ్చేకనే పుట్టాడు. బదిలీ అయి పదిహేనేళ్ళ క్రితం ఈ వూరు వచ్చేడు. వచ్చి, మరిక బదిలీలు రాకుండా జాగర్తపడుతూ ఆ వూళ్ళోనే కాస్త పొలం పుట్రా కొని కొంత, కొంతగా పెరుగుతున్నవాడు. పెరుగుతున్న మనిషికి నమ్మకమైన పనివాడు అవసరం.

మారయ్య ఆ అవసరం తీరుస్తున్నాడు.

ఒళ్ళొంచి బుద్ధిగా పనిచేసే మారయ్య అంటే సూర్యం మాస్టారికి చాలా ఇష్టం. అందుకే అతడ్ని పనివాడిలా చూడడు.

మారయ్యకి పని చేయడం ఎంత ఇష్టమో పేపర్లో వార్తలు వినడం అంత ఇష్టం. మారయ్యకి చదువు రాదు. అంచేత సూర్యం పేపరు చదవగా వింటాడు వార్తలు. లోకంలో రోజు రోజుకూ ఏమవుతుందో తెలుసుకునే కుతూహలం ఒకసారి పుడితే అది వదుల్కోలేని అలవాటుగా మారుతుంది.

మొదట్లో పేపరు పైకి చదివి వినిపించడం సూర్యానికి కాస్త చిరాకే అనిపించినా ఇపుడది అలవాటుగా మారింది. మారయ్య వున్నా లేకున్నా పైకి చదివితే గాని పేపరు చదివినట్టుండదు.

మారయ్య వార్తలు వినేసి వూర్కోడు. కలిగే సందేహాలు నివృత్తి చేసుకుంటాడు. అపుడపుడు వాదనలోకి దిగడం కద్దు. ఆ వాదన సూర్యంకి ఉత్సాహంగానే వుంటుంది. తెలిసిన వాళ్ళకి తెలియని వాళ్ళకు చెప్పడంలో ఓ ఆనందముంది. ఒక్కోసారి అతని వాదన అద్భుతంగా, అబ్బురంగా అనిపిస్తుంది.

ఈ రోజు అలాగే జరిగింది.

బంగ్లాదేశ్ ఎన్నికల ఫలితాలు వాయిదా వేసిన వార్త చదువుతూ అగ్రహంతో అన్నాడు సూర్యం.

"ఎర్షాద్ ప్రజాస్వామ్యం పీక నొక్కేస్తున్నాడు. రేపు చూడు – ఇంకే మిలటరీ వెధవో వాడి పీక నొక్కేస్తాడు. వాడి పీక ఇంకొకడు. వాళ్ళలా కొట్టుకు చస్తారు గాని – చచ్చినా ఎలక్షన్లు పెట్టరు"

మారయ్యకి ప్రజాస్వామ్యమంటే ఎప్పటికీ అయోమయ పదమే. ఆ మాట చాలాసార్లు చాలామంది నోట విన్నాడు. అది మాయా పదార్థంగా తోస్తుంది అతనికి. అతడికి ఎలక్షన్లు తెలుసు. ఈ దేశంలో వచ్చి వెళ్ళిపోయిన ఎలక్షన్లన్నీ చూసేడు. పాకిస్తాన్లోనూ అక్కడా అవి లేవా?

"మారయ్యా! శాంతియుతంగా అయిదేళ్ళకొకసారి ఎలక్షన్లు ఎంచక్కా అయే ఏర్పాటు మనకుంది. అధికారం కోసం ఆ తురక దేశాల్లోలాగ హత్యాకాండ ఇక్కడ ఏనాడైనా జరిగిందా? ఆ మాటకొస్తే ప్రజాస్వామ్యం మన దేశంలో మనగలుగుతున్నట్టు మరి ఏ ఇతర దేశాల్లోను మనగలగడం లేదు. అందుకు మనం గర్వపడాలి" అన్నాడు ఉత్సాహంగా, ఆవేశంగా సూర్యం.

అతని ఉత్సాహం, ఆవేశం చూసి కూడా 'మన దేశమంటే ఏమనుకున్నావ్' అనే గర్వం కలగలేదు మారయ్యకి.

అదే అన్నాడు – "అక్కడ రక్తపాతం జరిగినా, ఇక్కడ ఎలెచ్చన్లు జరిగినా కడకి మాబోటోళ్ళకి ఒరిగిందేమిటి? అక్కడా, ఇక్కడా పేదోడు పేదోడులానే వున్నాడు. పెద్దోళ్ళు ఎలా పదవిలోకి వస్తే మాకేటండి? మాకేటి చేశారనేది గావాలి?"

మారయ్య వేపు విస్మయంగా చుస్తూ వుండిపోయాడు – మధ్యతరగతి మాస్టారు సూర్యం.

స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, ఎన్నికలు – ఈ నాగరికత అంటే సూర్యం మాస్టారికి నిజంగా ఇష్టం.

కూడూ గుడ్డా బతుకు బాగుపడ్డం – ఇవి మించి ఆలోచించడు మారయ్య! 'ఎక్కి కూర్చునేందుకు నిన్నడిగి నెత్తిక్కితేం, బలిమినెక్కితేనేం?' – అనాలి మారయ్య? తన మనసులో వాదనని అలా సూటిగా అడగడానికి అతనికి మాటలు, వాటి చక్కటి పేర్పూ తెలీదు. ❁